# నా స్మృతి పథంలో ఒక రోజు

- శ్రీమతి మాచిరాజు లక్ష్మీ గంగా భవాని.

*గత సంచికలలో ...*

*స్థూల శరీరంతో చేసి, సూక్ష్మ శరీరంమీద పడిన ముద్రలు చివరి మజిలీ వరకు చెరిగిపోవు. మద్రాసులో కంప్యూటర్‌లోకి ఎక్కిన సమాచారం, సింగపూర్ వెళ్ళినా, అమెరికాలో అడుగుపెట్టినా మారదు. అంతర్గతంగా వున్నాయని తెలుసుకున్న ఆకాశదర్శనాలు, కళాదర్శనాలు, అన్నీ ఏ శ్రమచెయ్యకుండానే బొందితో కైలాసం అన్నట్టు, అమృత సమానమైన ఆ దర్శనాల అనుభవంతో అమృతమే అందిందికాని, ఇంత దూరం సముద్రంపైన ప్రయాణమా! అని భయం కలగలేదు.*

## శ్రీ గురుభ్యోనమః
## అమెరికా ప్రయాణంలో అనుభవాలు

విమానం హాంగ్‌కాంగ్‌లో ఆగగానే, 'Cathay Pacific' కేటరింగ్ సర్వీసు వారు ఆహారపదార్థాలు అందించారు. పెద్ద డబ్బా ఆకారంలో ఉన్న వేన్‌లో తెచ్చారు. అవి మీదికి ఎలా అందిస్తారో అనుకుంటుండగానే ఆ డబ్బాలాంటిది స్ప్రింగ్ ఏక్షన్‌లా పైపైకి లేచి విమానంకి సరాసరిగా వచ్చింది. ఎక్కడికక్కడ ఎన్ని ఏర్పాట్లో; అని ఆశ్చర్యం వేసింది. ప్రయాణం మళ్ళీ మొదలైంది. 7 గంటల 20 నిమిషాలకి ఫ్లైట్ మొదలయ్యింది. దిగినప్పుడు కనిపించినట్టే ఎగిరేటప్పుడు కూడా అందమైన దృశ్యాలు కనిపించాయి. T.V.లో మ్యాప్‌లో, హాంగ్ కాంగ్‌లో బయలుదేరిన విమానం ప్రయాణం చేస్తున్నట్లు చూపించారు. సముద్రం భాగంలో 'పసిఫిక్' అని వ్రాసి ఉంది. భూతలానికి అవతలివైపు ఉన్నది 'ఆర్కిటిక్' మహాసముద్రంగా వ్రాసి ఉంది.

7 గంటల 30 నిమిషములకు మళ్ళీ నేప్‌కిన్‌లు ఇచ్చారు. 7:45 కి (రాత్రి) టూత్ బ్రష్ సెట్టు ఉన్న ప్లాస్టిక్ కవర్లు ఇచ్చారు. 8 గంటలకి కూల్ డ్రింకు, 8:10 కి కారం వేరుశనగపప్పు పేకెట్లు ఇచ్చారు. కిటికీల అద్దాలు మూసెయ్యమన్నారు. చూడ్డానికి కూడా ఏమీ కనిపించదు, గాఢాంధకారం - అప్పుడప్పుడు వెలిగి ఆరే విమానం లైటు కాంతి మాత్రం కనిపించేది. చేసేది, చూసేది, లేదు కనుక విశ్రాంతిగా కళ్ళు మూసుకున్నాము. మధ్య మధ్యలో ఊరుకోలేక డోర్ (కిటికీ షట్టర్) ఎత్తి చూసేదాన్ని. పావుతక్కువ 12 గంటలకి వెలుగొచ్చింది. చాలా గంటల సమయం వెలుగుతప్ప ఇంకేం కనిపించలేదు. డోర్ తీసి అద్దంలోంచి చూడ్డానికి ఆ వెలుగు విపరీతంగా ఉంది. తట్టుకోలేక మూసి, కొంతసేపయాకా తెరిచిచూసి మళ్ళీ మూసెయ్యడం అయేది. 4 గంటలకి మళ్ళీ టవల్స్ ఇచ్చారు. 4:15 కి భోజనం ఇచ్చారు. మేం

భోజనం తీసుకోలేదు. కాఫీ మాత్రం తీసుకున్నాం. పూర్తిగా వెలుగు వచ్చినప్పటి నుంచి, ప్రయాణం అంతసేపూ సముద్రం అంతా పూర్తిగా పొగమంచు కప్పబడినట్టు తెల్లగా, పైన ఆకాశం స్వచ్ఛంగా నీలంగా ఉన్నాయి. ప్రకృతి అందాలు అనంతం. వెలుగొచ్చి ఎన్ని గంటలు గడిచినా, సూర్యనారాయణమూర్తి దర్శనం మాత్రం అవలేదు. బహుశా అవతలివైపు కనిపించి ఉండవచ్చునేమో! పొగమంచు తొలగినపుడు సముద్రంలో, ఒకొక్కచోట పెరుగు చిలికినవెన్న, ముద్దలు ముద్దలుగా తేలుతున్నట్టుగా ఉంది. "పాలు పెరుగై త్రచ్చంగ వేరైన నవనీతంబిక చల్లలో కలియునే? మారుతీ" అని మహానుభావుడు, జితేంద్రియుడు, వాయువేగంతో నూరు యోజనముల సముద్రాన్ని అవలీలగా దాటిన బలశాలి ఆంజనేయస్వామిని తలుచుకున్నాను. ఎంత కష్టపడి స్వామి కార్యము నెరవేర్చాడో! అనిపించింది.

T.V.లో మ్యాప్‌లో, హాంగ్ కాంగ్ నుంచి ప్రయాణంచేస్తున్న విమానం ఎంతదూరం వచ్చిందో, శాన్‌ఫ్రాన్‌సిస్కోకి ఎంతదూరంలో ఉందో, చూపిస్తున్నారు. ఒకసారి 988 మైళ్ళ వేగంతోను, 1001 మైళ్ళ వేగంతోనూ గంటలో ప్రయాణం జరుగుతున్నట్టు చూపిస్తున్నారు. వెయ్యి మైళ్ళ స్పీడులో వెళ్తున్నా, కదులుతున్నట్టే అనిపించలేదు. సమయం గడిచేకొద్దీ ప్రకృతి అందాలు దిద్దుకుంటూ, ముందురోజు చూసిన సన్నివేశాల్లాంటివే దర్శనం ఇస్తున్నాయి. T.V.లో గమ్యస్థానం దగ్గరవుతున్న సూచనలు తెలియజేస్తున్నారు. 6:25కి, హాంగ్ కాంగ్ లోకల్ టైమ్ 8:55కి, 36 నిమిషాల్లో శాన్‌ఫ్రాన్‌సిస్కో చేరుతుందని చూపించారు.

***పొగమంచు తొలగినపుడు సముద్రంలో, ఒకొక్కచోట పెరుగు చిలికినవెన్న, ముద్దలు ముద్దలుగా తేలుతున్నట్టుగా ఉంది. "పాలు పెరుగై త్రచ్చంగ వేరైన నవనీతంబిక చల్లలో కలియునే? మారుతీ" అని మహానుభావుడు, జితేంద్రియుడు, వాయువేగంతో నూరు యోజనముల సముద్రాన్ని అవలీలగా దాటిన బలశాలి ఆంజనేయస్వామిని తలుచుకున్నాను.***

కొద్ది నిమిషాల్లో సముద్రజలాలు అదృశ్యమయి, కెరటాలు ఒరిపిడి పడుతున్న భూమాత దర్శనం ఇచ్చింది. లేత ఆకుపచ్చ రంగులో మెత్తని తివాసీలు పరచినట్టు ఉన్నాయి. మధ్యమధ్యలో నీటి ప్రదేశాలు ఒక పద్ధతిలో గట్లు కట్టి అమర్చినట్టు ఉన్నాయి. విశాలమైన పొడుగుపాటి రోడ్లు అన్నీ సన్నని దారాల్లాగా, అతి వేగంగా పరుగెత్తే కార్లు చిన్న చిన్న చీమలబారుల్లాగా ఉన్నాయి. అందమైన కట్టడాలతో ఉన్న శాన్‌ఫ్రాన్‌సిస్కో ఎయిర్‌పోర్ట్‌లో 7 గంటలకు విమానం ఆగింది. మాకు స్పెషల్‌గా, "స్పెషల్ సర్వీస్" అని అంటించిన బేడ్జీలవలన ఎయిర్ హోస్టెస్, మమ్మల్ని తొందరపడి వెళ్ళొద్దని, కూర్చోమని చెప్పి, వత్తిడి తగ్గాకా మా బేగ్‌లు తీసి ఇచ్చి మాతో కూడా వచ్చి వెళ్ళవలసిన దారి చూపించి, లగేజీ ఎక్కడ తీసుకోవాలో చెప్పి, వెనక్కి వెళ్ళిపోయింది.

మూడు ఫ్లైట్‌లు ఒకసారి వచ్చినట్టు ఉన్నాయి. దేనికి దాని లగేజీ తీసుకునే బెల్టు నెంబరు ఉన్నాయి. మాకు తెలియక ఒక బెల్ట్ దగ్గర చూస్తూ ఉంటే, మాకు సంబంధించిన లగేజి ఒకటీ

కనిపించలేదు. ఈ లోగా ఎవరో అన్నారు సింగపూర్ నుంచి వచ్చినవి 3వ నెంబరు బెల్ట్ మీద ఉంటాయని. పక్కవాళ్ళ సహకారంతో లగేజి దింపుకున్నాము. ఇద్దరం కలసి వాటిని రెండు ట్రాలీల మీద పెట్టుకున్నాం. తరువాత ఎటు వెళ్ళాలో? ఏమి చెయ్యాలో తెలియదు. అధైర్యపడకుండా మిగతావాళ్ళు ఏం చేస్తున్నారో అలా చేద్దామని కొన్ని లైన్లు ఉంటే అందులో ఒక లైనులో నిలుచున్నాము. వరుసగా చాలా కౌంటర్లు ఉన్నాయి. బోర్డుచూస్తే కొన్నిటిమీద 'అమెరికా సిటిజన్ షిప్' అని, కొన్నిటిమీద 'నాన్ సిటిజన్‌షిప్' అని వ్రాసి ఉంది. పొరపాటు తెలుసుకుని వేరే లైన్‌లోకి (నాన్ సిటిజన్‌షిప్ లైన్‌లోకి) మారాము.

మేము దిగిన ఫ్లైట్‌లో మాతో పాటు దిగిన వాళ్ళు కనిపిస్తే వాళ్ళ వెనకాల నిలుచున్నాం. అక్కడ కౌంటర్‌లో వరుసగా ఒకరి తరువాత ఒకరిని పిలిచి, పాస్‌పోర్ట్‌లో వీసా చూసారు. ప్రశ్నలు వెయ్యబోతే మాకు ఇంగ్లీషు రాదని చెప్పాం. వీళ్ళకి ఎవడు వీసా ఇచ్చాడని తిట్టుకున్నాడు, మదర్ థెరిసా వచ్చిందని వెటకారం ఆడారు. మళ్ళీ పాస్‌పోర్ట్ చూసి, మమ్మల్ని చూసి, మీరు ఎక్కడికి వెళ్తున్నారని అడిగారు. "శాంతాక్లారా" అని చెప్పాను. అదేపేరు అతను ఒకసారి వత్తి పలుకుతూ, సూట్ కేస్ మీద ఉన్న అడ్రసు చూసుకున్నాడు. ఒక విధమైన మెషీన్ ద్వారా పాస్‌పోర్ట్‌లు "ఒకే" చేసుకుని, అతనిలో అతను అనుకుని, పాస్‌పోర్ట్ మీద - ముద్రవేసిన వేరే కార్డు పిన్ చేసి, మా చేతికిచ్చి, థేంక్స్ చెప్పి, ముందుకి వెళ్ళమన్నాడు. ఇక్కడ ఇంకొక పెద్ద తతంగం. మళ్ళీ లగేజి స్కేనింగ్, వాళ్ళకి నచ్చనివి తీసి పడెయ్యడం, అరడజను మంది ఆడ, మగ అందరూ చేతులకి గ్లౌజులు తొడుక్కుని, అనుమానం కలిగిన పేకింగ్‌లు విప్పేసి పారేస్తున్నారు. అప్పుడు మాత్రం కాస్త బెరుకుగా అనిపించింది. ఏం చేస్తారో? తిడతారో? అనుకుని దైవంమీద భారం వేసి, కార్యసానుకూలతకోసం అనుకునే అమ్మనామం అనుకుంటూ అరగంటకి దగ్గరకి వెళ్ళాం. అన్ని సామాన్లు కష్టపడి ఇద్దరం బెల్టు మీద పెట్టాం. అవతలకి వచ్చాకా ఏమి విప్పమంటాడో? అనుకుంటుండగా, ఒక చేతి బేగ్ మాత్రం విప్పించి, అందులో ఉన్న పావు కిలో పచ్చి వేరుశనగ గుళ్ళు పేకెట్టు విప్పిచూసి, అది మాత్రం పట్టుకెళ్ళడానికి వీలుకాదని అతి సున్నితంగా, లాలనగా చెప్పి, థేంక్స్ చెప్పి, ముందుకు వెళ్ళేదారి చూపించాడు. అమ్మ నామ మహిమ ఆ విధంగా రక్షణ కవచమైంది. లేకపోతే, ఏదో చిన్నది కనబడినందుకు ఒకరిని మొత్తం అన్ని లగేజీలూ పూర్తిగా విప్పించి, లోపల ఉన్న పేకెట్లు, డబ్బాల్లాంటివి, అన్నీ విప్పేసి పారేసారు. వాళ్ళు ఎంత బతిమాలినా ఇవ్వలేదు. 'మా అదృష్టం బాగుంది' అనుకున్నాము.

*ఇందులో వివరిస్తున్న అనుభవాలు ప్రతివారికీ సుపరిచితమే! కాని దానిని వ్యక్తీకరించడం ఒక కళ. ప్రతి చిన్న విషయాన్ని నిశితముగా పరిశీలించడము, దానిని విశ్లేషణాత్మకముగా అందజేయడం ఏ కొద్దిమందిమందికో చెల్లుతుంది. ఈ రోజుల్లో లేచినది మొదలు, మళ్ళీ నిద్రకు ఉపక్రమించే నిమిషము వరకు పరిగెట్టి పొలుతాగడమే దినచర్య కాగా, పరిస్థితిని నిశితముగా పరిశీలించడము, విశ్లేషించడము దాదాపుగా అసాధ్యమనే చెప్పాలి. కాని, మనసుంటే మార్గము ఉండకపోదు. ప్రయత్నించి చూద్దామా!*

*(ముగింపు జులై సంచికలో)*